క్లుప్తంగా

పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందజేత



గుంటూరు ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో జిల్లా అటవీశాఖాధికారి పోతురాజు ఆదివారం మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి కోరిటపాటి సతీష్, అధ్యక్షుడు పావులూరి శ్రీనివాసరావు రూ.ఎనిమిది వేలు విలువగల పుస్తకాలను అందజేశారు. అనంతరం నల్లపాడు ఎంటీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు గ్రంథాలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయశాఖ డెప్యూటీ డైరెక్టర్ సీహెచ్ దీక్షితులు, గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాయనాడ్ బాధితులకు అండగా ఉందాం



లక్ష్మీపురం: కేరళ వయనాడ్ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ సాయం అందించేందుకు ముందుకు రావాలని డీసీసీ అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు అన్నారు. స్థానిక గుంటూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్ఎస్‌యూఐ విభాగం నగరంలో విరాళాలను వసూలు చేయడం చాలా సంతోషదాయకంగా ఉందన్నారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం మాట్లాడుతూ కేరళ వయనాడ్ బాధితుల సహాయం కోసం రూ.50,970 విరాళం సేకరించినట్లు చెప్పారు. ఈసందర్భంగా వసూలు చేసిన మొత్తాన్ని లింగంశెట్టి ఈశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు వినయ్, జానీ, సునీల్, మీరావలి, అసిఫ్, సుమంత్ కళ్యాణ్, ఆకాష్, సత్య పాల్గొన్నారు.

చేతిరాతను మెరుగుపరచుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలోనే చేతిరాతను మెరుగుపరచుకోవడం ద్వారా చదువుపై ఏకాగ్రతతో పాటు జీవితానిన అందంగా మార్చుకోవచ్చునని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావు అన్నారు. క్యాలిగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఆదివారం స్తంభాల గరువులోని చేబ్రోలు పుల్లయ్య- మహాలక్ష్మి నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో 25 మంది ఉపాధ్యాయులతో పాటు 30 మంది విద్యార్థులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. రామమోహనరావు మాట్లాడుతూ క్యాలిగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 42,500 మంది విద్యార్థులతో పాటు 3,675 మంది ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చలమయ్య హైస్కూల్ హెచ్ఎం రమాదేవి, క్యాలిగ్రఫీ ఫ్యామిలీ సభ్యులు ప్రసాద్, షాజీర్, బురాన్, సత్యనారాయణ, రమేష్, చెన్నకేశవరావు, నాగలక్ష్మి, రమాదేవి, చెరుకుపల్లి రమాదేవి, శైలజారాణి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు దాన గుణానికి మారుపేరు



గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్యులు దాన గుణానికి మారుపేరు అని శివ ఇంజినీరింగ్ అధినేత మట్టుపల్లి శ్రీనివాస్ శరణ్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) కార్యాలయంలో అవోపా గుంటూరుశాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ శరణ్ మాట్లాడుతూ అవోపా ద్వారా విద్య, వైద్యం అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మెడిసిన్ చదివే పేద విద్యార్థికి ఐదేళ్లపాటు ఫీజులు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ప్రముఖ డాక్యుమెంట్ రైటర్ పొట్టి గోవర్ధన్ మాట్లాడుతూ ప్రతి నెలా 108 మంది పేదలకు రూ.500 చొప్పున పెన్షన్ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈసందర్భంగా పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ఆయన రూ.54 వేలు విరాళాన్ని అదజేశారు. కార్యక్రమంలో అవోపా ప్రతినిధి ఊటుకూరి నాగేశ్వరరావు, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు
- గోరంట్ల కొండమీద పనులు పరిశీలన

గుంటూరు రూరల్: నగర శివారు గోరంట్ల కొండ మీద రిజర్వాయర్ నిర్మాణ పనులు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా యుద్ధప్రాతిపదికన చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం కమిషనర్ నిలిచిన రిజర్వాయర్ పనుల్ని పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్ట్ వల్ల నీరందే ప్రాంతాలు, జనాభా, అంచనాలు, ప్రస్తుతం జరిగిన పనులు, ఇచ్చిన బిల్లులు, జరగాల్సిన పనులు, ఇతర అంశాల్ని ఇంజినీరింగ్ అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. నగరంలో విలీనమైన గ్రామాలకు అత్యంత ఆవశ్యకమైన గోరంట్ల కొండ మీద రిజర్వాయర్ పనులు తక్షణమే ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. పనులు ప్రారంభించిన తర్వాత బిల్లులు చెల్లింపునకు వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. శనివారం జరిగిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో కూడా ప్రజా ప్రతినిధులు ప్రాజెక్ట్ ప్రాధాన్యత, జాప్యంపై కౌన్సిల్ దృష్టికి తెచ్చారని చెప్పారు. పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ వేగంగా జరిగేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. అనంతరం కొండ పక్కన ఉన్న కొండ బజార్‌లో ఆయన పర్యటించారు. తాగునీటితో పాటు ప్రజలు పలు సమస్యల్ని ఆయన దృష్టికి తెచ్చారు. తాగునీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని ఏఈని ఆదేశించారు. వీధి దీపాల మరమ్మతులు, పైప్‌లైన్ లీకులు కూడా రెండు రోజుల్లో చేపట్టాలని తెలిపారు. డ్రెయిన్ల నిర్మాణం టెండర్ దశలో ఉందని, పనులు త్వరలో ప్రారంభం చేస్తామని ప్రజలకు ఆయన తెలిపారు. కొండ దగ్గరలోని క్రిస్టియన్ శ్మశానవాటిక లోలెవల్‌లో ఉందని ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. నగరంలో రోడ్ల విస్తరణ సమయంలో వచ్చే మెటీరియల్‌ను శ్మశానంలో లెవల్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఖాళీ స్థలాలను శుభ్రం చేసుకోవాలని యజమానులకు వెంటనే నోటీసులు ఇవ్వాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ శ్యాంసుందర్, డీఈఈ హనీఫ్, సతీష్, ఏఈ అనూష, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కార్పొరేటర్ బాలాజీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీలను వదలని మురుగు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు





కంకరగుంట ఆర్‌యూబీలోకి ప్రవేశించే ఇరువైపులా ప్రధాన మార్గంలో పేరుకుపోయిన మురుగునీరు

లక్ష్మీపురం: అధికారుల నిర్లక్ష్యంతో నగర ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. కొద్దిపాటి వర్షానికి ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రైల్వే అధికారులు కంకరగుంటలో ఆర్‌యూబీ ఏర్పాటు ఏర్పాటు చేశారు. నిర్మించిన ఎంతో కాలం గడుస్తున్నా.. వర్షం పడితే పూర్తిగా మురుగునీటితో నిండిపోవాల్సిన దుస్థితి కనిపిస్తోంది. వాహనదారులు, పాదచారులు మురుగు నీటిలో నుంచి వెళ్లాల్సి వస్తుంది. ముందు ఇరువైపులా ప్రధాన మార్గంలో వర్షం నీరు, మురుగు నీరు ప్రవహించేందుకు ఓ చిన్నపాటి కాలువను దానిపై ఇనుప కంచె ఏర్పాటు చేశారు. అయితే ఆ ఇనుప కంచె మూతపై, ఆర్‌యూబీ మధ్యలో ఉన్న రంధ్రాలు మట్టితో నిండి పోవడంతో మురుగు నీరు కాలువలో నుంచి ప్రవహించకుండా ఆర్‌యూబీలోకి చేరుతోంది. ఇదిలా ఉంటే కొద్దిపాటి వర్షం కురిసిందంటే చాలు ఈ ఆర్‌యూబీ నిండి పోయి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అయితే ప్రస్తుతం ఈ మార్గం ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఉన్న కాలువలో మురుగు అంతా కూడా నిల్వ చేరి ఉండటంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. మురుగు నీరంతా దుస్తులపై పడుతోందని వాపోతున్నారు.

మందుబాబులకు అడ్డగా...

ఆర్‌యూబీ లోపలి భాగంలో విద్యుత్ దీపాలు సక్రమంగా పని చేయడం లేదు. దీంతో కొందరు గుర్తు తెలియని యువకులు మద్యం తాగి విద్యార్థినులను, మహిళలను వేధిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షపు నీరు నిండి పోయి రాకపోకలు అంతరాయం కలిగిన సమయంలో రైలు పట్టాలపై నుంచి పాదచారులు వెళుతుంటారు. అయితే రైలు పట్టాలపై ఫ్లైఓవర్ కింద మందు బాబులు మద్యం తాగి అసభ్య పదజాలంతో మాట్లాడుతూ ఇబ్బందులు గురి చేస్తుంటారని చెబుతున్నారు.

ప్రజల ప్రాణాలు కాపాడే డాక్టర్‌లకు రక్షణేది ?



నిరసన తెలియజేస్తున్న సమితి నేతలు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది

గుంటూరు మెడికల్: కోల్‌కొతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ఆదివారం గుంటూరులో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ పిలుపు మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షురాలు, గుంటూరుకు చెందిన సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ షమా సుల్తానా మాట్లాడుతూ భారతావని ఈ ఘటనతో ఉలిక్కిపడిందన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని చేసుకుంటున్న వేళ ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్ల ప్రాణాలు కాపాడుకోలేని దుస్థితి మనకు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విపరీత మనస్తత్వంతో మానవ మృగాలుగా మారి అభం శుభం తెలియని పసివారిని వదలక వారి ప్రాణాలను ఛిద్రం చేస్తుంటే లోపం ఎక్కడుందో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. డాక్టర్ సారిక మాట్లాడుతూ గాంధీజీ చెప్పిన విధంగా నిజమైన స్వాతంత్ర్యం ఇప్పటివరకు రాలేదన్నారు. ఆడవారు అర్ధరాత్రి కాదు కదా పట్టపగలు బయటకు వెళ్లినా తిరిగి ఇంటికి క్షేమంగా వస్తారనే నమ్మకాలు లేని దుస్థితి నేటి సమాజంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షలు విధించాలని కోరారు మరెవరైనా సరే ఆడవారిపై ఇలాంటి ఘటనకు పాల్పడాలంటే భయాన్ని కలిగించేలా ఆ శిక్షలు ఉండాలని డిమాండ్ చేశారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ అబ్దుల్ గఫూర్ మాట్లాడుతూ నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు దేశానికి సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఇలాంటి ఘటన జరగటం ప్రతి ఒక్కరి మనసులను కలిచి వేస్తుందన్నారు.

వైద్య విద్యార్థిని హత్యను నిరసిస్తూ గుంటూరు బైక్ బండిట్స్ రైడింగ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. లాడ్జి సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శించారు. పనిచేసే మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ చట్టాలు కల్పించాలని కోరారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై స్వరరాగ సుధ ఆధ్వర్యంలో ఆదివారం భక్తి సంగీత విభావరి నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరు నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాయని గాయకులు కె.వి. సాయిబాబాశర్మ, కృష్ణకుమారి గాత్ర ధారణలో స్వామి, అమ్మవార్ల భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. కీబోర్డుపై రామకృష్ణశర్మ, తబలాపై షణ్ముఖ శర్మ వాయిద్యా సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

21న డీఎస్సీ అభ్యర్థులకు అవగాహన సదస్సు

తెనాలి: డీఎస్సీ పరీక్ష రాయనున్న అభ్యర్థులకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, జనవిజ్ఞానవేదిక నిర్వహణలో ఈనెల 21వ తేదీన తెనాలిలో ఉచిత అవగాహన సదస్సును నిర్వహించనున్నారు. ఆయా సంస్థల నాయకులు ఎండీ గయాసుద్దౌలా, టీఎస్ఎస్ఎల్ మల్లేశ్వరరావు, అహ్మద్ హుస్సేన్, కామాక్షి, కె.సాంబశివరావు, అమిరిశెట్టి శ్రీధర్, అంగిరేకుల ఉమామహేశ్వరరావు, కుర్రా శ్రీనివాసరావు వివరాలను తెలియజేశారు. స్థానిక కొత్తపేటలోని ఎన్జీఓ కల్యాణమండపంలో సాయంత్రం 5.30 గంటల నుంచి 8 గంటల వరకు జరగనున్న సదస్సులో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డీఎస్సీ పరీక్షపై అవగాహన కల్పిస్తారన్నారు.

గుండెజబ్బులపై అవగాహన అవసరం



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.హేమ సుందర్, పక్కన సంస్థసభ్యులు

లక్ష్మీపురం: క్రమపద్ధతిలో జీవనం ద్వారా గుండె జబ్బులకు దూరంగా ఉండవచ్చని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కే హేమసుందర్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పూర్వకాలంలో ఈ గుండెకు సంబంధించిన సమస్యలు పెద్దవారిలో ఎక్కువగా చూసేవారం, కానీ ఇటీవల శ్రమలేని పని విధానం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడిలో ఇతర అనారోగ్య సమస్యలు మూలంగా చిన్న వయసు వారిలో కూడా గుండెకు సంబంధించిన సమస్యలను చూస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు ఛాతిలో నొప్పిగా అనిపించినప్పుడు అది గ్యాస్ నొప్పి అని అపోహ చెందక వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని కోరారు. అనంతరం అవగాహన సభ్యులు అడిగిన గుండెకు సంబంధించిన వ్యాధులకు తగు వైద్య సలహాలు, సూచనలను ఇచ్చారు. అవగాహన సభ్యులు డాక్టర్ కే హేమ సుందర్ ఘనంగా సత్కరించారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, అవగాహన సంస్థ సీనియర్ సభ్యులు ఆర్.రామచంద్ర రావు, ఫణి కుమార్, వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: ప్రజల నుంచి తాగునీటి సరఫరా, వీధి దీపాలు ఇతర సమస్యలపై సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో అర్జీలు స్వీకరించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాధిపతులు, డెప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజ్ చేసిన వాహనాలకు జరిమానా



నగరంపాలెం: మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని నల్లపాడు పీఎస్ సీఐ వంశీధర్ తల్లిదండ్రులకు సూచించారు. శనివారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు చేపట్టిన విషయం విదితమే. ఈ మేరకు సీజ్ చేసిన 198 వాహనాలకు ఆదివారం పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిమానా విధించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిబంధనలపై వాహన తనిఖీలు చేపట్టామని అన్నారు. పిల్లలకు వాహనాలు అప్పగిస్తే ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నా యని పేర్కొన్నారు. అదే విధంగా నంబర్ ప్లేట్‌లేకుండా నేరాలు జరుగుతున్నాయని, ఈ క్రమంలో నేరాలు, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నామని అన్నారు. ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

• లోడ్ పట్టుతప్పితే.. ప్రాణాలు 'ఓవర్'



హైవేపై ఓవర్ లోడ్‌తో ప్రమాదకరంగా వెళుతున్న ఆటో

ప్రత్తిపాడు: ఇక్కడ కనిపిస్తున్న ఈ వాహనాన్ని చూడండి. చిన్న ఆటోపై ఎంత లోడు నింపారో! పెద్ద పెద్ద గోతాలను ఒకదానిపై ఒకటి కట్టి ప్రమాద భరితంగా నడుపుతున్నారు. మితిమీరిన లోడును వాహనంపై ఉంచడమే కాకుండా వేగంగా వెళుతుండటంతో పూర్తిగా పక్కకు ఒరిగిపోయింది. పొరబాటున పట్టు తప్పితే వెనుక వచ్చే ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసినట్లే. ఈ చిత్రం ప్రత్తిపాడు మండల పరిధిలోని యనమదల పదహారవ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం కనిపించింది. రవాణాశాఖ అధికారులు పూర్తిగా తనిఖీలను విస్మరించడంతో, కొందరు ఇలా ఓవర్ లోడ్‌తో వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారకులవుతున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



భరతనాట్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

గుంటూరు రూరల్: నగర శివారు ఇన్నర్ రింగ్ రోడ్డులో గల శిల్పారామంలో ఆదివారం పలు సాంస్కృతిక అంశాల్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జరిగిన భరతనాట్య ప్రదర్శన ప్రేక్షకుల్ని కనువిందు చేసింది. నగరంలోని శ్రీ మంజునాథ నాట్య క్షేత్రం కళాకారులు భక్తి గీతాల నృత్య ప్రదర్శన నిర్వహించారు. కళాకారుల నృత్యాలు సందర్శకుల్ని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్గనైజర్ ఆర్. మనోజ్ఞ, ప్రదీప్, శిల్పారామం ఏవో శ్రీనివాస రెడ్డి, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దేశమాంబకు శ్రావణ ప్రత్యేక పూజలు







మంచాల గ్రామంలో ప్రత్యేక పూజలు అందుకున్న గ్రామ దేవత దేశమాంబ , ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న చేబ్రోలు గ్రామ దేవత శ్రీరాములమ్మ ,చేబ్రోలులో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ

మంచాల(చేబ్రోలు): మంచాల గ్రామంలోని గ్రామ దేవత దేశమాంబకు ఆదివారం గ్రామస్తులు శ్రావణమాస ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం సుఖశాంతులతో ఉండాలని కోరుతూ ఏటా శ్రావణ మాసంలో మూడు వారాల పాటు గ్రామస్తులు ప్రత్యేక పూజలు, పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకుంటారు. ఆదివారం చివరి వారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలతో ఊరేగింపుగా దేవాలయానికి చేరుకున్నారు. అమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

శ్రీరాములమ్మకు పూజలు

చేబ్రోలు గ్రామదేవత శ్రీరాములమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పొంగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణమాసం సందర్భంగా ఏటా అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహిస్తారు. మేళతాళాలతో వేలాదిమంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఆలయం ఎదురుగా భక్తులు భారీ విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. విద్యుత్దీపాల వెలుగులో అమ్మవారి ఆలయం తళతళ మెరిసింది.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్టా మహోత్సవంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి

నగరంపాలెం: భూత, భవిష్యత్, వర్తమానాలను కాలజ్ఞాన రూపంగా ప్రపంచానికి అందించిన కాలజ్ఞాని విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. అరండల్‌పేట చంద్రయ్యనగర్ 11/3వ అడ్డ రోడ్డులో గణపతి, గోవిందమాంబ సమేత విరాట్ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, మాత ఈశ్వరిదేవి, సిద్ధయ్య విగ్రహాల పునఃప్రతిష్ట, నూతన ధ్వజస్తంభ స్థాపన మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ట ప్రధాన ఆచార్యులు ఆలూరి సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో అశేష భక్తుల భక్తి ప్రపత్తులతో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామిని కుల మతాలకు అతీతంగా ఆరాధిస్తారని పేర్కొన్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కడియాల సుబ్బారావు మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి కలియుగ ప్రత్యక్ష దైవమని అన్నారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి, 52వ డివిజన్ కార్పొరేటర్ మల్లెబోయిన శ్రీవల్లి, కడియాల సూర్యకుమారి, బజరంగ్‌దళ్ రామకృష్ణ, గట్టి శ్రీనివాసరావు, సిద్ది సాంబశివరావు, కె గోవర్ధనచారి, ఎం.శివరామకష్ణ, భక్తులు పాల్గొన్నారు. అనంతరం పెద్ద ఎత్తున్న అన్నదానం నిర్వహించారు.

రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోవాలి



మంగళగిరి: రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. భూదందాలు పాల్పడితే తీవ్ర చర్యలు ఉంటాయని చెప్పారు.